

# అనగనగా ఓ మంచి కథ

## ? - భువనచంద్ర

***(ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర గారు సినీరంగంలోకి రాకముందు వ్రాసిన కథ ఇది. రచనా తేది: 1/1/1981 , ఇంతవరకూ అముద్రితం)***

**"ఈ రోజు ఆమెని మళ్ళీ చూశాను!"**

"ఎవరామె?"

"పెద్ద పెద్ద కళ్ళతో చూస్తూ.. చూపులతోనే మాట్లాడుతుందని చెప్పానే.. ఆమె!"

"మాట్లాడిందా?"

"ఆ!"

"ఏమని?"

"కళ్ళని ఒకసారి బాగా తెరిచి, రెప్పల్ని రెపరెపలాడించి చూసింది. మెల్లగా పైపైకి వచ్చే సూర్యకిరణాల్లాగా ఆ చూపులు నన్ను గుచ్చుకుని కొంత ఆనందాన్నీ ఆశ్చర్యాన్నీ కలుగజేశాయి. పువ్వు సన్నగా విచ్చుకున్నట్టుగా ఆమె పెదాలు అతి నిశ్శబ్దంగా విచ్చుకుని ఓ బుల్లి చిరునవ్వు వెన్నెల్లో నన్ను ముంచివేశాయి!"

"మాట్లాడావా?"

"ఎలా? ఆమెతో ఎవరో ఉన్నారు!"

"ఎవరు?"

"ఏమో! తండ్రి అయి ఉండొచ్చు.. మరో బంధువెవరైనా అయి ఉండొచ్చు!"

"పోనీ ఆమె అయినా నీతో మాట్లాడాలని ప్రయత్నించలేదా?"

"చెప్పాగా.. ఆమె చూపులతోనే మాట్లాడుతుందని!"

"నువ్వో వెర్రివాడివి."

"కానిదెవరూ?"

"అంటే?"

"ఎప్పుడో ఒకప్పుడు ఎవరిముందో ఒకరి ముందు. పిచ్చివాళ్ళు కానిదెవ్వరూ?"

"నీ కవిత్వం, నీ ఊహలూ, నీ పిచ్చిమాటలూ అంతా పిచ్చే!"

"కొంత మాత్రమే 'పిచ్చి' ఉంటే బాధపడాలి గానీ - పూర్తి పిచ్చివాడికి బాధెందుకూ? అయినా 'పిచ్చి' తనంలో ఉన్న ఆనందం పిచ్చోళ్ళకి తెలుస్తుంది గానీ మంచోళ్ళకి కాదుగదా!"

❀❀❀

***మూడునెలల తరువాత..***

"ఏంటోయ్ ఆలోచిస్తున్నావ్?"

"ఆమె వస్తానని రాలేదు!"

"ఎవరూ?"

"అదే కళ్ళతో మాట్లాడుతుందని చెప్పానూ.."

"అర్థమైందిలే.. అయితే పరిచయం పెరిగిందన్నమాట!"

"వస్తానని రాలేదు!"

"ఎక్కడికి!"

"నిన్నవస్తానంది. శివుడి గుళ్ళో నంది విగ్రహం దగ్గరికి, కానీ రాలేదు."

"నువ్వెళ్ళకపోయావా?"

"తనెక్కడుంటుందో నాకు తెలిస్తేగా?"

"అడ్రస్ అడగలేదా?"

"అసలు మాట్లాడుకున్నదెప్పుడు?"

"మరి?"

"సినిమాల్లో కనిపించి, అక్కడికి వస్తానని కౌంటర్ ఫాయిల్ మీద రాసి నా వైపు విసిరింది!"

"ఇంకా?"

"ఇంకా మధురంగా, ఎడారిలోని నున్నని ఇసుక మీద చల్లని వెన్నెల్లో పాము పాకినంత సున్నితంగా నవ్వింది"

"ఎప్పుడూ నవ్వులేనా?"

"నీకేం తెలుసూ ఆ నవ్వుల్లోని బాసలూ ఆశలూ!.. నువ్వెలా ఊహించగలవూ ఆ నవ్వుల్లోని ఆత్మీయులూ, అనురాగం!

"తెలవకపోవటమే మంచిది..! లేకపోతే నీలాగా నేనూ వెర్రివాడ్నయి ఉండేవాడిని!"

"... వెర్రివాడికీ పిచ్చివాడికీ పెద్ద తేడా ఏమీలేదు..! అయినా అందరికీ వెర్రివాడో పిచ్చివాడో అయే అదృష్టం తేలిగ్గా దొరుకుతుందా? "

“Godbless you mad idiot..!”

❀❀❀

**ఇంకో నెల తరువాత**

"ఏమిటీ అలాగడ్డం పెంచావు?"

"..... ..... "

"నిన్నే.. ఏమిటీ సంగతి?"

"ఏమీలేదు!"

"మరి ఎందుకా నిరాసక్తత?

"మామూలుగానే!"

"ప్రేయసికి పెళ్ళైయిపోయిందా?"

"..... ..... "

"అదేనోయ్.. నీ చిరునవ్వులో చిన్నమ్మాయ్ కనిపించట్లేదా?"

"ఎందుక్కనిపించదూ?"

"మరి?"

"..... ..... "

"ఇదిగో చూడు.. ప్రపంచం 'నిశ్శబ్దమయం' అని నాకు చెప్పకు.. జరిగిందేదో చెప్పు!"

"నాకేమన్నా అర్థమైతేగా?"

"అంటే?"

"మొన్నా మధ్య చూశాను.. తనలో చాలా మార్పు వచ్చింది!"

"ఎందుకో చెప్పిందా?"

"మాట్లాడుకుంటే కదా చెప్పడానికి!"

"పోనీ చూపులతోనే అనుకో!"

"ఆ కళ్ళల్లో మొన్నటి వరకూ కనిపించే కలల వెన్నెలా, ఆశల అల్లరీ కనిపించలా..."

"మరి?"

"ఓ క్షణం నా వంక చూసింది! అమావాస్యరాత్రిలో నడిసంద్రంలో చీకటి ముద్దలు ముద్దలుగా ఆకాశం నుంచి రాలిపడుతున్నట్లు అనిపించింది. పంజరంలోని పక్షి - తలుపులు తీశాక కూడా నిర్లిప్తంగా పంజరంలోనే ఉండిపోయినట్లనిపించింది. ఎండిపోయిన మరో వృక్షం భోరున కురిసే వర్షంతో, 'ఇక నీ అవసరం నాకు లేదు' అని ఉన్న పళంగా కూలిపోయినట్లు అనిపించింది!"

"ఆహా! అంతేనా?"

"ఊహూ! 'నేనింకా ఇట్లానే ఉంటాను.' అని అన్నట్లనిపించింది!"

"మాట్లాడటానికి నువు ప్రయత్నించలేదా?

"ఇవన్నీ మాటలుకావా?"

"నోరుందిగా.. కళ్ళతో ఎందుకూ మాట్లాడటం?"

"మాట్లాడేనోరు చూడలేదు.. చూసే కళ్ళు మాట్లాడగలవు.. అఫ్‌కోర్స్ అర్థం చేసుకోగలిగితే?"

"తను ఒక్కతే ఉందా?"

"ఏమో! తనని మాత్రమే నా కళ్ళు చూశాయి. ఆ క్షణం నుంచి ఇతరుల్ని చూడ్డం మానేశాయి!"

"అంత ఆరాధనా?"

"ఇది ఆరాధన ఎలా అవుతుందీ?"

"నాకు నవ్వొస్తోంది!"

"పోనీలే!. నన్ను చూసి నవ్వగలగడం కూడా నా 'పుణ్యం' వల్లనేగా!"

"నేననటం నవ్వే రాత నీ మొహాన లేదని!"

"రాత ఎక్కడుందో నాకు తెలీదు గానీ నవ్వేదీ, నవ్వించేదీ, ఏడ్చేదీ ఏడ్పించేదీ అన్నీ మనసే!"

"ఇంతకీ తర్వాత ఏం చేయదలచుకున్నావు?"

"చేయటానికేముందీ?"

"అప్పుడెప్పుడో 'నంది' దగ్గరకి వస్తానందిగా? వచ్చిందా?"

"మూడో రోజున వచ్చింది.. తుమ్మెద వాలినంత సున్నితంగా నడుస్తూ వచ్చింది. రెక్కలు విచ్చుకుని అల్లరిగాలికి అటూ ఇటూ తుళ్ళే సీతాకోకచిలుకలాగా, ఆకుల సందుల నుంచి సూర్యుడ్ని అల్లరిగా చూసి మళ్ళీ గభాల్న సిగ్గుతో ఆకుచాటున దాగే మొగ్గలాగా, నువ్వు కదిలినప్పుడల్లా కదుల్తూ నిన్ను వెక్కిరించే నీడలాగా 'నిన్ను మింగేస్తానని' భయపెడుతూ ఇంతెత్తున లేచి, మళ్ళీ దయగా ప్రేమగా నీ పాదాల్ని ముద్దుపెట్టుకుని ఒద్దికగా వెనక్కి వెళ్ళిపోయే కడలి అలలాగా వచ్చింది!"

"ఉపమానాలెందుకూ?"

"లేకపోతే ఎలా వచ్చిందో ఎలా తెలుస్తుంది?"

"సరేనయ్యా..! వచ్చి ఏమన్నదీ?"

"ఓ నవ్వు నవ్వింది.. ఆ నవ్వులో, నీ ఆరాటమూ నీ ప్రేమా, నీ పిచ్చితనమూ నేను గమనిస్తూనే ఉన్నాను తెలుసా' అన్న చిలిపిదనం ఉంది!"

"నువ్వేమన్నావు?"

"మాటలురాలా! కొద్దిగా.. సన్నని విల్లులా వంగిన ఆమె పెదవి ఒంపుని చూస్తూ కూర్చున్నాను. ఆమె తన కనురెప్పలు కదిలిస్తుంటే, 'హృదయానికి తలుపులుంటాయా అనిపించింది!"

"ఏం చేశారు?"

"అక్కడి నుంచి ఓ కాఫీ స్టాల్ దగ్గర ఆగాము. ఆమె మెనూ కార్డుని చూసి 'కాఫీ' దగ్గర వేలు పెట్టింది. కాఫీ తాగాక 'ఇక వెళ్ళిరానా?' అన్నట్లు చూసి కుర్చీలోంచి లేచింది!"

"ఇంకాసేపు ఉండమనక పోయావా?"

"ఆమె అనునయంగా ఇచ్చిన 'ఆజ్ఞ' అది. కాదని ఎలా ఆపనూ?"

"ఆ తరువాత?"

"వెన్నెల మీద కదిలే సెలయేటి కెరటంలా మెత్తగా నడుస్తూ వెళ్ళిపోయింది. "

"సెలయేటి మీద కదిలే వెన్నెల కిరణంలా అనుకుంటా?"

"ఏదైనా ఒకటే."

"కనీసం అప్పుడైనా ఆమెని వెంబడించాలనిపించలేదా?"

"ఎందుకూ వెంబడించటం?"

"నువ్వుత్తి మూర్ఖుడివి.?"

"మరో డిగ్రీ నా చేతికిచ్చావన్నమాట..!"

"హూ.. నీతో మాట్లాడటం శుద్ధ వేస్ట్!"

"ఇదీ అసలు సిసలు జ్ఞానమంటే!"

"నీ ఉద్దేశం?"

"పిచ్చివాడివికాకుండా పిచ్చివాడితోటీ, వెర్రివాడివి లేకుండా వెర్రివాడితోటీ, మూర్ఖుడివి కాకుండా మూర్ఖుడి తోటీ మాట్లాడటం వేస్టేగా!"

"ఛీ!" ఎవరో విసవిసా నడుస్తూ వెళ్ళడం చూస్తే విచిత్రంగా ఉండదూ?

***మరో రెండు నెలల తరువాత***

"చాలా రోజుల తరవాత కనబడ్డావే..!ఏం చేస్తున్నావూ?"

"చెయ్యడానికే ముందీ?"

"తను కనిపించిందా?"

"ఆ! నిర్వికారంగా నా వంక చూసింది. ఆ చూపులో వెయ్యికోట్ల సూర్యుళ్ళు ఒకేసారి అస్తమించినంత నిర్లిప్తత ఉంది. కోటిమంది స్త్రీలు తమ భర్తల అనుమానపు చూపులకు గురైతే ఎంత ఆవేదన ఉంటుందో, అంత ఆవేదన ఉంది. హాయిగా ఎగిరిపోయే పక్షికి సడన్‌గా తుపాకి దెబ్బ తగిల్తే ఎంత బాధ కలుగుతుందో అంత బాధా ఆ చూపులో ఉంది. ఓ మనిషీ నేనూ మీలాంటి దాన్నే అని ఓ అబల దిక్కులు పిక్కటిల్లేలా రోదించిన రోదన ఆ చూపులో నాకు వినిపించింది!"

"ఓర్నీ ఉపమానాలు తగలబడా!"

"అదీ ఉంది.! చల్లగా కురిసిన మంచు సూర్యుడి కాల్చే చూపుకి భస్మమైనంత భావం ఆ కళ్ళల్లో కదలాడింది!"

"నువ్వేమీ అడగలేదా?"

"మాటొస్తే గదా? ఆమెని చూసిన క్షణమే నాకు, చీకట్లో వెన్నెల విరిసినట్లూ, ఎడారిలో మల్లెపూలు విచ్చుకున్నట్లూ, మంచి ముత్యాలు గుట్టలుగా ఆకాశం నుంచి రాలి మంచుబిందువుల్లా పున్నమిలో ప్రతిఫలించినట్టూ అనిపిస్తుంది. ఇంకేం మాట్లాడగలనూ?"

"పోనీ తనైనా చూపుల్తో ఇంకేం చెప్పలేదా?"

" 'నీవున్నావుగా నేస్తం.. నాకోసం.. కేవలం నాకోసం..!' అన్నట్లు అనిపించింది."

"ఆ తర్వాత?"

"అంత దుఃఖంలోనూ ఓ చిన్న సంతృప్తి కళ్ళల్లో కదిలించి మెల్లగా సాగిపోయింది!"

"Damn you..!"

"Thank you..!"

"ఎందుకని అడగవేం?"

"ఎందుకడగాలీ? నేనేదో చెయ్యాలనీ, ఆమెతో ఏదేదో మాట్లాడితే బాగుంటుందనీ నువ్వు ఊహిస్తావు. నీ ఊహని నేను నిజం చెయ్యకపోతే నీకు కోపం రావటం సహజమేగా?"

**మరో పదిహేనురోజుల తరువాత**

"ఏమీటోయ్ అలాగున్నావూ?"

"ఎలా ఉన్నానూ?"

"జీవితాన్ని భరిస్తూ భరించలేనివాడిలాగే, వేదనా సముద్రంలోకి ఈడ్చుకుని పోబడుతూ ఆనంద తరంగాల్లో తేలిపోతున్నవాడిలాగా, చీకట్లో ముళ్ళమీద నడుస్తూ, అదే పట్టపగలయినట్టూ పువ్వుల మీద నడుస్తూ ఉన్నట్టు ఊహించుకునే వాడిలాగా, అసహజంగా ఉన్నావెందుకూ?"

"ఇందులో అసహజం ఏముంది? జీవమూ జీవితమూలాగానే నేనూ సహజంగానే ఉన్నాను."

"హూ"

"ఏంటి ఒక్క నిట్టూర్పుతో సరిపెట్టేశావూ? వర్ణనలు లేవా?"

"చిట్టచివరి శ్వాసకూడా నిట్టూర్పులాంటిదేగా!"

"అయితే నీ ప్రేమకూడా చివరి శ్వాసలో ఉందా?"

"ప్రేమ అనంతం.. దానికి ఆదీ అంతం లేవు. అలాగే ప్రేమకీ తొలిశ్వాసా తుదిశ్వాసా అనేవి ఉండవు!"

"పోనీ ఆమె కలిసిందా?"

"ఏమని చెప్పనూ?"

"మనసులో ఉన్నదే చెప్పు!"

"నాలోని ఆమె 'సజీవి'.. లోకం దృష్టిలో మాత్రం చలిస్తున్న నిర్జీవి!"

"అంటే?"

"ఓయి మూర్ఖుడా. ఈ లోకం ఆమెని ఐశ్వర్యపు శిఖరాల మీదికెత్తింది కానీ ఆమెకోరుకుంది శిఖరాలు కాదు.. అనురాగపు లోయలు.. ఈ లోకం ఆమెకి అంతులేని ఆభరణాలిచ్చింది. కానీ అవి ఆమెకి శృంఖలాలవుతాయని లోకానికేం తెలుసూ? ఆమెకోసం పూలబాటలు పరిచానంటూ లోకం ఉప్పొంగిపోయింది. కానీ నాకు తెలుసు.. ఆ పూల మాటున దాగిన ముళ్ళు ఆమె పాదాల్నించి వెచ్చని నెత్తుర్ని జుర్రుకున్నాయని!"

"అంటే?"

"ఆమె ప్రకృతి!"

"అంటే?"

"అంటే ఆమె స్త్రీ! స్త్రీత్వం లేని ప్రకృతి లేదు!.. అంతెందుకూ పుట్టుకా ప్రకృతే మృత్యువూ ప్రకృతే.. ప్రకృతి కానిది అసలేముందీ?"

"అంతేనా?"

"ఆ..! ఆ చిక్కిన శరీరాన్ని చూస్తే నా మనసులో చంద్రోదయమైంది. ఆ చిక్కిన బుగ్గల్ని కళ్ళకింద నలుపు చారల్నీ చూస్తే జాబిలి పక్కగా జాబిలిని కప్పివేస్తూ ఓ నల్లని మేఘం పయినిస్తున్నట్లు అనిపించింది. ఓ పూల చెట్టు పూవుల భారాన్ని భరించలేక మనసులోని ఊహల్లా పువ్వుల్ని నేల రాల్చినట్లనిపించింది. అంతెందుకూ.. నా రెండు కళ్ళలోంచీ కోటానుకోట్ల గ్రహాలూ నక్షత్రాలూ దూసుకుంటూ పోయి, ఆమె పచ్చని పాదాల చుట్టూ పరిభ్రమిస్తున్నట్లనిపించింది!"

"పిచ్చివదల్లేదన్నమాట!"

"వదిలితే అది పిచ్చి ఎందుకవుతుందీ?"

***ఆ తరువాత .. కొన్ని రుతువులు గడిచాక***

"నువ్వింకా బ్రతికే ఉన్నావా?"

"చూస్తూనే ఉన్నావుగా.!"

"అదే!"

"అంటే?"

"ఈ లోకంలో అని.!"

"ఈ లోకం నాకు నచ్చలా! నేనూ ఈ లోకానికి నచ్చలా.! అందుకే నా లోకం నేను సృష్టించుకున్నా..!"

"మరి ఆమె?"

"నాతోనే ఉంది.! నాలోనే ఉంది.! మొన్నటిదాకా నేను వేరూ ఆమె వేరూ అనిపించేది.. ఇప్పుడు ఇద్దరం లేమనీ ఉన్నది ఒక్కరమేననీ తెలిసింది!"

"తలకి రోకలి చుట్టుకున్నావన్నమాట!"

"నిజం నేస్తం..! శరీరపు హద్దులు దాటి చూడు.! ఉన్నది ఒక్కటే... అది 'నేను' అనే తాను!"

"మరి తనూ?"

"తాను అనబడేనేను!"

"అర్థంకాలా..!"

"కాదు.!"

"పోనీ నువ్వు చెప్పు.. అర్థం చేసుకుంటూ.!"

"భాష ఉంటేగా చెప్పడానికి!"

"మాట్లాడుతున్నావుగా?"

"ఈ భాష మనం సృష్టించుకున్నది.. నిజంగా చెబుతున్నా. మౌనాన్ని మించిన భాష లేదు!"

"మరి ప్రేమ?"

"అదొక్కటే సత్యం.. మిగతావన్నీ భ్రమలే!"

"ఓహో 'నో' మాయని ఛేదించావన్నమాట!"

"మాయ అనేది ఉంటేగా ఛేదించడానికి?"

"నాకు పిచ్చెక్కుతోంది.!"

"ఇన్నాళ్ళకు అదృష్టం నీ తలుపు తట్టింది.. గుండె తలుపులు తెరుచుకో..ఆశల పక్షుల్ని ఆకాశంలోకి వదిలెయ్.. శరీరం ముక్కలయిపోయి ఓ మహా ప్రవాహంలాంటి ప్రవాహం పుట్టుకొస్తుంది.. దాన్లో కొట్టుకుపో.."

"చచ్చిపోతే?"

"అదే.. దాన్నే అంటారు! 'బ్రతకడం' అని!"

❀❀❀

**NEW**
Click here to share your comments on this story